క్లుప్తంగా

అర్హులందరికీ పింఛన్లు



మెలిపాకలో పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

మునగపాక: అర్హులందరికీ పింఛన్‌లు అందజేస్తామని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ తెలిపారు. మండలంలోని మెలిపాకలో మంగళవారం ఆయన పింఛన్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా పింఛన్‌లు అందజేస్తున్నామన్నారు. ఎంపీడీవో ప్రసాద్, తహసీల్దార్ ఆది మహేశ్వరరావు, కూటమి నేతలు టెక్కలి పరశురామ్, దొడ్డి శ్రీనివాసరావు, రాజశేఖర్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

యలమంచిలి రూరల్: పట్టణంలోని 8వ వార్డులో ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పలువురు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్‌కు ఎంపిక



కోటవురట్లలో విజేతలతో హెచ్‌ఎం లక్ష్మి, పీడీ గణేష్

కోటవురట్ల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు పలు క్రీడల్లో ప్రతిభ చూపి విజేతలుగా నిలిచారు. నియోజకవర్గ స్థాయిలో జరిగిన స్కూల్ గేమ్స్‌లో అండర్-14 విభాగం ఖోఖోలో వై.వరప్రసాద్, కబడ్డీలో వెంకట్ దినేష్, వాలీబాల్‌లో విజయ్‌కుమార్, చెస్‌లో పి.లోకేష్, అండర్-17 విభాగం ఖోఖోలో ఎస్.మణికంఠ, కబడ్డీలో టి.లోవరాజు, వి.జగన్, యు.అరుణ్‌కుమార్, బ్యాడ్మింటన్‌లో ఎం.వరప్రసాద్, జి.సాయిచరణ్, వాలీబాల్‌లో కె.లిఖిన్ విజేతలుగా నిలిచారు. వీరంతా జిల్లా స్థాయిలో ఆడేందుకు అర్హత సాధించడంతో హెచ్‌ఎం ఎం.లక్ష్మి, పీడీ గణేష్, ఉపాధ్యాయుడు నారాయణరెడ్డి, పీఈటీ బాబు, డ్రాయింగ్ టీచర్ ఈశ్వర్, తదితరులు అభినందించారు.

చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ



ప్రతిభాపత్రాలతో విద్యార్థులు, హెచ్‌ఎం లక్ష్మీ నారాయణ

కోటవురట్ల: పాములవాక కిల్లాడ రామ్మూర్తినాయుడు జెడ్పీ హైస్కూల్‌లో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. పాఠశాల స్థాయిలో నిర్వహించిన ఈ పరీక్షలకు పలువురు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మౌనిక(8వ తరగతి), లిఖితమణి(9వ తరగతి), మధుబాబు(పదో తరగతి) విజేతలుగా నిలిచారు. వారిని హెచ్‌ఎం కె.వి.లక్ష్మీనారాయణ అభినందించారు. ఇటువంటి పోటీలు విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయడంతో పాటు విజ్ఞానాన్ని పెంపొందిస్తాయని హెచ్‌ఎం తెలిపారు. విజేతలకు జన విజ్ఞాన వేదిక తరఫున ప్రతిభా పత్రం, సైన్స్ విజ్ఞాన పుస్తకం అందజేశారు.

హరిపాలెం పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ



హరిపాలెం పీహెచ్‌సీలో మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి బాలాజీ

అచ్యుతాపురం(మునగపాక): అచ్యుతాపురం మండలం హరిపాలెం పీహెచ్‌సీని మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఎం.బాలాజీ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. మలేరియా, టీబీ పరీక్షలకు సంబంధించిన గదిని పరిశీలించారు. జాతీయ కార్యక్రమాలకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన సేవలందించాలని సూచనలు చేశారు. డాక్టర్ మానస, ఆరోగ్య బోధకులు రామలక్ష్మి, ఆరోగ్య పర్యవేక్షకులు సునీత, ఎం.ఉమామహేష్, యూడీసీ శిరీష, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎన్నెన్ని రూపాలు.. దుర్గమ్మ ప్రతిమలు

- యలమంచిలిలో పెద్ద సంఖ్యలో విక్రయాలు
- రేపటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు



విగ్రహాలకు రంగులు వేస్తున్న తయారీదారులు



వివిధ సైజుల్లో తయారు చేసిన అమ్మవారి విగ్రహాలు

యలమంచిలి రూరల్: యలమంచిలి కళాకారుల చేతిలో దుర్గమ్మ విగ్రహాలు కళాత్మకంగా రూపుదిద్దుకుంటున్నాయి. ఈ నెల 3వ తేదీ నుంచి దేవీ శరన్నవరాత్రి వేడుకలు ప్రారంభం కానున్న నేపథ్యంలో అమ్మవారి విగ్రహాలు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నాయి. యలమంచిలి పట్టణంలో వినాయక విగ్రహాలతో పాటు దుర్గమ్మ విగ్రహాలు కూడా పెద్ద సంఖ్యలో ఇక్కడి కళాకారులు తయారు చేస్తున్నారు. ఒక అడుగు నుంచి 12 అడుగుల వరకు వివిధ రూపాల్లో ప్రతిమలు లభ్యమవుతున్నాయి. గురువారం నుంచి ప్రారంభం కానున్న నవరాత్రి ఉత్సవాలకు విగ్రహాలను కొనుగోలు చేసేందుకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున మండపాల నిర్వాహకులు యలమంచిలి పట్టణానికి వస్తున్నారు. నచ్చిన విగ్రహాలను ఎంపిక చేసుకుని తయారీదారులకు అడ్వాన్సులు చెల్లించి వెళ్తున్నారు. యలమంచిలి నియోజకవర్గంతో పాటు చుట్టు పక్కల మండలాల్లో దేవీ శరన్నవరాత్రి వేడుకలు తొమ్మిది రోజుల పాటు నిర్వహించనున్నారు. మరో వైపు పట్టణం, గ్రామాల్లో దేవీ నవరాత్రుల సందడి మొదలైంది. ఆయా ఆలయాలు, కాలనీల్లో ఏర్పాట్లు భారీగా చేస్తున్నారు. ప్రత్యేక మండపాల ఏర్పాట్లలో నిర్వాహకులు తలమునకలై ఉన్నారు.

అమ్మకాలు బాగున్నాయి



వినాయక విగ్రహాల తయారీలో పోటీ ఎక్కువగా ఉంటుంది. దుర్గమ్మ విగ్రహాల తయారీకి అంత ఎక్కువ పోటీ ఉండదు. ప్రస్తుతం విగ్రహాల అమ్మకాలు బాగున్నాయి. మరో రెండ్రోజుల్లో మరింత ఊపందుకుంటాయని భావిస్తున్నాం. విగ్రహాల తయారీకి సంబంధించి ముడు సరుకు, కూలీ ధరలు గతం కంటే పెరిగినా విగ్రహాల ధరలు పెంచలేదు. విగ్రహాల తయారీలో ఆరుగురు పని చేస్తున్నాం.

– మునగపాక గోవింద్, తయారీదారుడు, యలమంచిలి

ఆర్డర్లపై నచ్చిన సైజులో తయారీ



పట్టణంలో మూడు చోట్ల పెద్ద సంఖ్యలో దుర్గమ్మ విగ్రహాలు తయారు చేస్తున్నాం. భక్తులు, మండపాల నిర్వాహకులు వారికి నచ్చిన సైజులో విగ్రహానికి ముందుగా ఆర్డర్లు ఇచ్చారు. భక్తుల అభిరుచికి తగినట్లుగా విగ్రహాలను తయారు చేసి ఇస్తున్నాం. ఐదడుగుల విగ్రహం ధర రూ.6 వేలుగా ఉంది. సైజును బట్టి ధర ఉంటుంది. 20 ఏళ్లుగా విగ్రహాల తయారీ పని చేస్తూ జీవనోపాధి పొందుతున్నాం. దసరా సీజన్ తర్వాత ఇతర పనులకు వెళ్తాం.

– కొత్తల రాజు, తయారీదారుడు, యలమంచిలి

ఉచిత ఇసుక హామీ అమలుకు 4న ఆందోళన



భవన నిర్మాణ కార్మికులతో సమావేశమైన సీఐటీయూ నేతలు

అచ్యుతాపురం(మునగపాక): ఉచిత ఇసుక హామీని తక్షణమే అమలు చేయాలని సీఐటీయూ నేతలు రాము, సోమునాయుడు డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు కూటమి నేతలు ఇచ్చిన హామీలో భాగంగా ఉచిత ఇసుక అమలు చేయాలన్నారు. అచ్యుతాపురం, హరిపాలెం, దోసూరు తదితర గ్రామాల్లో మంగళవారం భవన నిర్మాణ కార్మికులతో వారు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి నేతలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా ఉచిత ఇసుక ఎక్కడా అమలు కాలేదన్నారు. గతంలో ట్రాక్టర్ ఇసుక రూ.5వేలు కాగా.. నేడు అదే ట్రాక్టర్‌కు రూ.12 వేలు తీసుకుంటున్నారన్నారు. అయినా ఇసుక దొరకడం లేదన్నారు. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉచిత ఇసుక హామీ అమలు చేయాలని కోరుతూ ఈ నెల 4న జరిగే ఆందోళనలు జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కార్మికులు కూండ్రపు రాజు, శ్రీను, రమేష్, రాజు, రాజన్న, అప్పలనాయుడు, బాబూరావు, వసంత, తదితరులు పాల్గొన్నారు.

సమతుల్య ఎరువులతో నాణ్యమైన పంట



దేవవరంలో రైతులకు సూచనలు ఇస్తున్న ఏవో ఉమాప్రసాద్

నక్కపల్లి : సమతుల్య ఎరువులు వాడకం ద్వారా వరిలో నాణ్యమైన పంట, దిగుబడి సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి ఉమా ప్రసాద్ అన్నారు. మంగళవారం దేవవరం, ఒడ్డిమెట్ట, చినరామభద్రపురం, తదితర గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల పొలాల్లోకి వెళ్లి క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాల వల్ల వరి పంట పాడవకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం సస్య రక్షణ శాస్త్రవేత్త నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ వరి, జీడిమామిడి, పత్తి పంటలలో యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు, మాజీ ఎంపీపీ దేవర సత్యనారాయణ, సర్పంచ్ రాఘవకుమారి, బత్తుల రమణబాబు, చొప్పా శ్రీను, ఏఈవో సత్యనారాయణ, వీవోఏలు కృష్ణమోహన్, నాయుడు పాల్గొన్నారు.

సస్యరక్షణపై దృష్టి సారించాలి

పాయకరావుపేట: రైతులు పంటలపై సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని ఏవో పి.ఆదినారాయణ అన్నారు. సత్యవరం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులు వరి పంటలపై తీసుకోవలసిన జాగ్రత్తలు, ఎరువులు, పురుగు మందులు వినియోగంపై అవగాహన కల్పించారు. అనంతరం వరి పంటలను పరిశీలించారు.

హరిపురం గ్రామంలో..

రాంబిల్లి(యలమంచిలి): రాంబిల్లి మండలం హరిపురం, వెల్చూరు గ్రామాల్లో మంగళవారం మండలం వ్యసాయాధికారి సిహెచ్.సుమంత ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఎరువుల వాడకం, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ధూళి దేముడమ్మ, వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకుడు ధూళి బుజ్జి, రైతులు పాల్గొన్నారు.

రాంబిల్లిలో భవన నిర్మాణ కార్మికుల ఆందోళన



ఉచితంగా ఇసుక అందించి ఉపాధి కల్పించాలంటూ నిరసన తెలుపుతున్న భవన నిర్మాణ కార్మికులు

రాంబిల్లి(యలమంచిలి): కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలో ఉచిత ఇసుకను అందించి భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేముడునాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం రాంబిల్లి మండలం పెదకలవలాపల్లి గ్రామం భవన నిర్మాణ కార్మికుల ఆధ్వర్యంలో ప్రభుత్వం ఉచిత ఇసుకను అందించి తమకు ఉపాధిని కల్పించాలంటూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు నెలలుగా ఇసుక లేక భవన నిర్మాణ కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కన్నా ఇప్పుడు ఇసుక రేటును అదనంగా పెంచి అమ్ముతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకొని ఉచిత ఇసుక అందించాలని, భవన నిర్మాణ కార్మికులకు పెండింగ్ క్లెయింలు బిల్డింగ్ వెల్ఫేర్ బోర్డు నుంచి అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ సిహెచ్.రామకృష్ణ, దుర్గాంబికా భవన నిర్మాణ సంఘం అధ్యక్షుడు ఎస్.రాంబాబు, కొత్తమ్మతల్లి భవన నిర్మాణ సంఘం అధ్యక్షుడు రాము, చినకలవలాపల్లి సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

తోటాడలో తుప్పల తొలగింపు

మునగపాక: మండలంలోని తోటాడ మార్గంలో తుప్పల తొలగింపు పనులు మంగళవారం చేపట్టారు. ప్రస్తుతం ఉన్న రహదారిని అభివృద్ధి చేసేందుకు అవసరమయ్యే చర్యలు కూడా ప్రారంభమయ్యాయి. అనకాపల్లి జాతీయ రహదారి నుంచి పరవాడకు వెళ్లే మార్గంలోని తోటాడ పంచాయతీ పరిధిలో రహదారికి ఇరువైపులా పెరిగిన తుప్పలను జేసీబీతో తొలగించారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు దాడి శ్రీనివాసరావు, పి.మురళి, ఎంవీఆర్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం జంక్షన్ ఆధునికీకరణకు కృషి

అచ్యుతాపురం(మునగపాక): అచ్యుతాపురం జంక్షన్ ఆధునికీకరణకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. మంగళవారం ఆయన అచ్యుతాపురం జంక్షన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అచ్యుతాపురం జంక్షన్ విస్తరణకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. తద్వారా ట్రాఫిక్ సమస్య పరిష్కారంతో పాటు ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ద్వారపురెడ్డి బాబ్జీ, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వృద్ధుల దినోత్సవ ర్యాలీ



హరిపాలెంలో వృద్ధుల దినోత్సవ ర్యాలీ

అచ్యుతాపురం(మునగపాక): వృద్ధులు తేలికగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలని హరిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి మానస సూచించారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా మంగళవారం నిర్వహించిన ర్యాలీ ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీర్ణక్రియ మందగించడం, గ్యాస్ సమస్యలు రావడం, మలబద్ధకం పెరగడం, వ్యాధి నిరోధక శక్తి తగ్గిపోవడం వంటి సమస్యలు వృద్ధుల్లో ఉంటాయన్నారు. పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు తాజా కూరగాయలు శ్రేయస్కరమన్నారు. చివరి రోజుల్లో అందరితో ఆనందంగా గడపడం మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులు తాజా ఆహారం తీసుకోవడం శ్రేయస్కరం



మాట్లాడుతున్న మునగపాక పీహెచ్‌సీ వైద్యాధికారి విమలగిరి

మునగపాక: వృద్ధులు ఈ సీజన్‌లో జాగ్రత్తలు తీసుకోవాలని మునగపాక పీహెచ్‌సీ వైద్యాధికారి నంది విమల గిరి కోరారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా మంగళవారం మునగపాకలో వృద్ధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వృద్ధులు తాజా ఆహారం తీసుకోవడం శ్రేయస్కరమన్నారు. ఎటువంటి అనారోగ్యం సంభవించినా నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలన్నారు. సీహెచ్‌వో దేవకాంత, వైద్య సిబ్బంది, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పాఠశాలల్లో మరుగుదొడ్ల పరిశీలన



మరుగుదొడ్లు పరిశీలిస్తున్న ఎంపీడీవో సీతారామరాజు

నక్కపల్లి: మండలంలో చందనాడ, ఎస్.నర్సాపురం పాఠశాలల్లో మరుగుదొడ్లను ఎంపీడీవో సీతారామరాజు మంగళవారం పరిశీలించారు. పాఠశాలలను తనిఖీ చేసిన అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. భోజనం ఎలా ఉందని, మరుగుదొడ్లు శుభ్రంగా ఉంటున్నాయా? లేదా? అంటూ ఆరా తీశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులకు పెట్టే భోజనం నాణ్యతగా, రుచికరంగా ఉండాలని, మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. రన్నింగ్ వాటర్ సదుపాయం కల్పించాలన్నారు.

వసతి గృహాల మూసివేత దారుణం

యలమంచిలి రూరల్: యలమంచిలి పట్టణంలో నిర్వహిస్తున్న బీసీ బాలికలు, బాలుర వసతి గృహాలను మంగళవారం ఉదయం నుంచే మూసివేయడం దారుణమని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జి.గీతాకృష్ణ, ఉపాధ్యక్షుడు మైలపల్లి బాలాజీ అన్నారు. ప్రభుత్వం ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఈ నెల 3వ తేదీ నుంచి, ఆంధ్ర విశ్వ విద్యాలయం పరిధిలో డిగ్రీ కళాశాలలకు ఈ నెల 7వ తేదీ నుంచి సెలవులు అధికారికంగా ప్రకటించగా.. వసతి గృహాలను ఒకటో తేదీనే ఎలా మూసివేస్తారని వారు ప్రశ్నించారు. ఈ మేరకు వారు జిల్లా వెనుకబడిన తరగతుల డిప్యూటీ డైరెక్టర్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు.

స్వర్ణాంధ్ర పోటీల్లో డిగ్రీ కళాశాల విద్యార్థినుల ప్రతిభ



జిల్లా స్థాయిలో వివిధ విభాగాల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

యలమంచిలి రూరల్: స్వర్ణాంధ్ర-2047 పోటీల్లో యలమంచిలి గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినులు వివిధ విభాగాల్లో జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.చంద్రశేఖర్ తెలిపారు. కళాశాలలో బీకాం మూడో సంవత్సరం చదువుతున్న జి.అనుష్క వ్యాస రచన, వక్తృత్వ పోటీల్లో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. బృంద చర్చలో బీఏ చదువుతున్న కె.భవానీ బృందం ద్వితీయ స్థానం పొందగా, బీకాం తృతీయ సంవత్సరం విద్యార్థిని ఖిలాశ్రీ వక్తృత్వ పోటీలో మూడో స్థానంలో నిలిచినట్టు ప్రిన్సిపాల్ చెప్పారు. సోమవారం అనకాపల్లిలో జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ చేతుల మీదుగా బహుమతులు అందుకున్న విద్యార్థినులను మంగళవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రేఖా రామారావు, పీడీ ఎనుముల పోలిరెడ్డి, వివిధ విభాగాల హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం తహసీల్దార్‌గా రమేష్‌బాబు



బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ రమేష్‌బాబుని అభినందిస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఎస్.రాయవరం: ఎస్.రాయవరం మండల తహసీల్దార్‌గా జె.రమేష్‌బాబు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల బదిలీల్లో భాగంగా కె.కోటపాడు మండల తహసీల్దార్‌గా పనిచేసిన ఈయన ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన తహసీల్దార్ అనకాపల్లి మండలానికి బదిలీ అయ్యారు. రమేష్‌బాబుకు రెవెన్యూ సిబ్బంది స్వాగతం పలికి, శాలువా కప్పి సత్కరించారు. అలాగే డిప్యూటీ తహసీల్దార్‌గా ఎంవీఎస్ నీరజ్ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో సంఘం అధ్యక్షుడు నూకరాజు, మండల సర్వేయర్ త్రిమూర్తి, ఆర్ఐలు వినయ్, ప్రసాద్, వీఆర్వో గోపి, తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యం ప్రధానం



మాట్లాడుతున్న పీహెచ్‌సీ సిబ్బంది

ఎస్.రాయవరం: ప్రతి ఒక్కరికీ శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఆరోగ్యం కూడా ఎంతో అవసరమని పీహెచ్‌సీ సిబ్బంది ఎన్.వి.ఎస్.ప్రసాద్ తెలిపారు. సైతారుపేట ప్రాథమిక పాఠశాలలో మానసిక ఆరోగ్య మాసోత్సవాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు మానసిక ప్రశాంతతను కూడా అలవాటు చేసుకోవాలని సూచించారు.

ప్రభుత్వ మద్యం షాపుల సిబ్బంది ఆందోళన



అడ్డురోడ్డులో మద్యం దుకాణాలు బంద్ చేసి నిరసన తెలుపుతున్న సిబ్బంది

ఎస్.రాయవరం: ప్రభుత్వ మద్యం దుకాణాల్లో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నిరసన తెలిపారు. మద్యం పాలసీ సెప్టెంబర్ 30తో ముగియడంతో తాము ఏ ప్రాతిపదికన పని చేయాలో అధికారులు చెప్పకపోవడంతో మంగళవారం రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు దుకాణాలు బంద్ చేసి ఆందోళన చేశారు. ఐదేళ్లుగా నిస్వార్థంగా సేవలు అందిస్తున్న తమను ఇప్పుడు ఉన్నట్టు ఉండి తొలగిస్తే కుటుంబాలతో రోడ్డున పడతామని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఎక్సైజ్ పోలీసులు వచ్చి దుకాణాలు తెరవాలని ఒత్తిడి తెచ్చారు. అయినా దుకాణాలు తెరవలేదు. సాయంత్రం రాష్ట్ర యూనియన్ సూచన మేరకు 5 గంటలకు దుకాణాలు తెరిచి మద్యం విక్రయాలు చేపట్టారు. ఈ ఆందోళన కార్యక్రమంలో సూపర్‌వైజర్ వీసం రామస్వామినాయుడు, నానేపల్లి బాబ్జి, కె.ఎస్.మూర్తి, కె.వెంకటరమణ, ఆపరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు రైల్వేస్టేషన్ స్కూల్ విద్యార్థులు



అథ్లెటిక్స్‌లో జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన రైల్వేస్టేషన్ స్కూల్ విద్యార్థులు

యలమంచిలి రూరల్: నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్‌లో యలమంచిలి రైల్వేస్టేషన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. అచ్యుతాపురంలో జరిగిన పోటీల్లో అథ్లెటిక్స్‌లో నానేపల్లి దుర్గ 400 మీటర్లు, 800 మీటర్లు, బొద్దపు జగన్ 800 మీటర్లు, చాపల హరి 1500 మీటర్ల పరుగు పందెంలో ప్రతిభ కనబరిచి నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ ముగ్గురినీ జిల్లా స్థాయి పరుగు పందెం పోటీలకు ఎంపిక చేశారని స్కూల్ పీఈటీ మూర్తి తెలిపారు. విజేతలను మంగళవారం పాఠశాలలో హెచ్‌ఎం భవానీ, ఉపాధ్యాయులు కొణతాల విశ్వేశ్వరరావు, నాగేశ్వరరావు, ఫ్లోరెన్స్ అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎస్.రాయవరం: మండలంలో వమ్మవరం, పెద ఉప్పలం గ్రామాలకు బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు అనకాపల్లి డీఈ రాజశేఖర్ తెలిపారు. కొరుప్రోలు సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల క్లియరెన్స్ కారణంగా విద్యుత్ కోత విధిస్తున్నట్టు పేర్కొన్నారు.

గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవలు

పాయకరావుపేట: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా పాయకరావుపేట, పాల్తేరు, ఈదటం, పాల్మన్‌పేట, మంగవరం, సత్యవరం గ్రామాల్లో కాలువల్లో పూడికతీత, రోడ్ల శుభ్రత, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల అభివృద్ధిపై దృష్టి సారించినట్టు ఎంపీడీవో జయప్రకాష్ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఆయా గ్రామాల కార్యదర్శులు నరేష్, సత్యనారాయణ, హేస్సేన్, వరహాలుబాబు, శివాజీ, శ్రీధర్, ఈవోఆర్‌డీ చంద్రశేఖర్ పాల్గొన్నారు.


క్రీడలతో మానసికోల్లాసం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డిప్యూటీ డీఈవో అప్పారావు

ఎస్.రాయవరం: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగించడమే కాకుండా శరీర దృఢత్వాన్ని కూడా పెంచుతాయని యలమంచిలి డిప్యూటీ డీఈవో పి.అప్పారావు అన్నారు. పెదగుమ్ములూరు ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉమ్మడి విశాఖ జిల్లా స్కూల్ గేమ్ ఫెడరేషన్ పోటీలు, సెలక్షన్స్ నిర్వహించారు. ముందుగా డిప్యూటీ డీఈవో వివిధ నియోజకవర్గాల నుంచి విచ్చేసిన క్రీడాకారులను పరిచయం చేసుకుని, పోటీలు ప్రారంభించారు. బాలికలు, బాలుర విభాగంలో నిర్వహించిన పోటీలకు పలు పాఠశాలల పీడీలు, పీఈటీలు, ఇతర ఉపాధ్యాయుల కమిటీలు విచ్చేసి ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు.

ఎన్‌ఎంఎంఎస్ పుస్తకాల అందజేత



విద్యార్థులకు ఎన్‌ఎంఎంఎస్ పుస్తకాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

యలమంచిలి రూరల్: రేగుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం 8వ తరగతి విద్యార్థులకు నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్) పుస్తకాలను అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈవీఎస్ గణేష్, ఉపాధ్యాయులు అల్లు రత్నరాజు, ఎం కాశీవిశ్వేశ్వరరావు ఆర్థిక సహాయంతో విద్యార్థులకు ఉచితంగా ఈ పుస్తకాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.కామేశ్వరి, వై.రాజ్యలక్ష్మి, కె.వాణిశ్రీ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు ప్రశంసనీయం



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్

యలమంచిలి రూరల్: పేద, బలహీన వర్గాల ఉన్నతికి లయన్స్ క్లబ్ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం యలమంచిలి మండలం జంపపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 136 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, స్టడీ మెటీరియల్, మ్యాప్, అట్లాస్ పుస్తకాలను ఆయన అందజేశారు. విద్యార్థులు మారుతున్న పోటీ ప్రపంచంలో నిలదొక్కుకునేందుకు కష్టపడి చదవాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఏవీహెచ్ శాస్త్రి, లయన్స్ క్లబ్ సభ్యులు బంగారుశెట్టి, కె.శంకర గిరి, కట్టా సుబ్రహ్మణ్యం, కె.ఆంజనేయులు, డీవీబీ రాజు, సుంకర గిరి, సర్పంచ్ ఎస్.నాయుడు, స్కూల్ యాజమాన్య కమిటీ చైర్మన్ ఎస్.కనకారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.